సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ׀ 10 ׀ నవంబర్ ׀ 2024



సన్న రకాలకు బోనస్

జిల్లాలో వానాకాలం వరి ధాన్యం సేకరణ ప్రారంభమైంది. కాగా, సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోంది. 8లో



ముఠా పనికీ ముడుపులు..?

అప్పారావుపేట ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో గెలలు అన్‌లోడ్ చేసే ముఠా పనికీ రూ.2.50 లక్షలు అడుగుతున్నట్లు సమాచారం. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 20°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రిపూట వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక శనివారం వైభవంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన జెన్‌కో క్రీడా పోటీలు



ఫుట్‌బాల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఈ

పాల్వంచ: గత మూడు రోజులుగా స్థానిక విద్యుత్ కళాభారతి క్రీడా మైదానంలో జరుగుతున్న టీజీ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ఫుట్‌బాల్ పోటీల్లో కేటీపీఎస్ 5, 6 దశల జట్టు ప్రథమ, బీటీపీఎస్ ద్వితీయ, కేటీపీఎస్ 7వ దశ తృతీయ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీలో కేటీపీఎస్ 7వ దశ ప్రథమ, జూరాల ద్వితీయ, కేటీపీపీ జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు ట్రోఫీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లోనూ జెన్‌కో క్రీడాకారులు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు తమ సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో క్రీడల అధికారి లోహిత్ ఆనంద్, సెక్రటరీలు వీరస్వామి, మహేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదాని కి అర్చకులు పంచామృతంతో అభిషేకం జరి పించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం జరిపించాక వేలాదిగా హాజరైన భక్తుల సమక్షా న పల్లకీ నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

పీఠం ఎవరిదో..?

రామాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోసం పలువురి ప్రయత్నాలు

- రాజధానిలోనే మకాం వేసి పావులు కదుపుతున్న నాయకులు
- సీఎం ఆశీస్సుల కోసం ఆయా నేతల ఎదురుచూపులు
- నామినేటెడ్ పోస్టులు దక్కించుకునేందుకు మంత్రుల ద్వారా పైరవీలు



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ పదవి కోసం పలువురు నాయకులు పోటీ పడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి వరుసగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తుండడంతో దేవస్థానం ట్రస్ట్ బోర్డుపై కాంగ్రెస్ నాయకులు గంపెడాశలు పెట్టుకున్నారు. రాష్ట్ర రాజధానిలోనే మకాం వేసి లాబీయింగ్ చేస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కొలువుదీరే తొలి పాలకమండలి ఏర్పాటుపై భక్తులు, పలువురు నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పోటీ ఎక్కువే..

భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో 13వ ట్రస్ట్ బోర్డు 2010 నవంబర్ 26 నుంచి 2012 నవంబర్ 25 వరకు కొనసాగింది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం జరగగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండుసార్లు అధికారంలోకి వచ్చినా ట్రస్ట్ బోర్డును నియమించలేదు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలక మండలి ఏర్పాటుపై ఆ పార్టీ నాయకులు, ఇతర పార్టీల నుంచి వచ్చిన జంపింగ్ జిలానీలు సైతం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం వరుసగా పలు కార్పొరేషన్లకు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం పాలక మండలి ఏర్పాటుపై దృష్టి సారించారనే ఊహాగానాలు వచ్చాయి. దీంతో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన పలువురు నాయకులు, ఆధ్యాత్మిక వేత్తలు, తెలంగాణ ఉద్యమ నేతలు ఈ పదవులను ఆశిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు.

ఎవరి లాబీయింగ్ వారిదే..

ప్రధానంగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ గిరీకి భారీ పోటీ నెలకొంది. గతంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా పనిచేసిన ఓ నాయకుడి కుమారుడు లాబీయింగ్ జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇతను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అతడి సోదరి బీజేపీలో కీలక పదవిలో ఉండటంతో ఆ పార్టీ ప్రధాన నాయకుల పరిచయాలు కూడా కలిసి వస్తాయని భావిస్తున్నారు. ఆయనతో పాటు అదే ట్రస్ట్ బోర్డులో పనిచేసిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓ సభ్యుడు మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ద్వారా చైర్మన్ కుర్చీ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇతను హైదరాబాద్ స్థాయిలో పలువురి ద్వారా పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎంపీ బలరాం నాయక్ ద్వారా భద్రాచలానికి చెందిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మరో నాయకుడు ప్రయత్నాలు చేస్తున్నా స్థానిక రాజకీయ వర్గ విభేదాలు అడ్డంకిగా మారే అవకాశం ఉన్నట్లు పలువురు భావిస్తున్నారు. మరో నేత టీఎన్‌జీవోస్ మాజీ నాయకుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ద్వారా గతంలోనే తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇక భద్రాచలానికి చెందిన ఓ యువనేత, మరికొందరు కూడా తమ పలుకుబడి, పరిచయాలే పెట్టుబడిగా పాలకమండలి చైర్మన్, సభ్యుల పోస్టుల కోసం కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోనే మకాం వేశారు. చివరి ట్రస్ట్ బోర్డులో చైర్మన్, తొమ్మిది మంది సభ్యులతోపాటు ఒకరు ఎక్స్‌అఫిషియో సభ్యుడు(రామాలయ ప్రధాన అర్చకుడు) పనిచేశారు. పెరుగుతున్న పోటీ, పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు ఈ సారి నియమించే పాలక మండలిలో ఈ సంఖ్య పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్



జిన్నింగ్ మిల్లులో పత్తి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సురేంద్రమోహన్, పక్కన కలెక్టర్

సుజాతనగర్ : సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ అన్నారు. మండలంలోని డేగలమడుగు జిన్నింగ్ మిల్లులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, నిల్వ ఉన్న పత్తిలో తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం పత్తి కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చే పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 మధ్య ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. మిల్లులోకి పత్తి వచ్చినప్పటి నుంచి కొనుగోలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. రైతులతో మాట్లాడి ఎన్ని రోజుల్లో డబ్బు జమ అవుతోందని అడిగి తెలుసుకున్నారు. వాట్సప్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను రెండు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం క్వింటాకు రూ.7,521 రైతులకు చెల్లించాలన్నారు. రైతులు కూడా దళారులను ఆశ్రయించకుండా, సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు డేగలమడుగు గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, పౌర సరఫరాల అధికారి త్రినాథ్‌బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి జె.నరేందర్, తహసీల్దార్ జి.శిరీష, ఎంపీడీఓ బి.భారతి, ఏపీఎం మీరాంబీ తదితరులు పాల్గొన్నారు.

ఆశలు.. ఆకాంక్షలు!



ట్రంప్ విజయంతో పలువురు ప్రవాస భారతీయుల్లో భరోసా

- ఐటీ రంగం మరింత వృద్ధి చెందుతుందని వెల్లడి
- పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం
- తద్వారా ఉద్యోగ, ఉపాధికి అవకాశాలు మెరుగవుతాయని అంచనా

ఖమ్మంగాంధీచౌక్: అగ్రరాజ్యమైన అమెరికా ఎన్నికల ఫలితాలు ఇటీవల వెల్లడయ్యాయి. అమెరికా అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో అక్కడ ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్లిన వారితో పాటు చదువు పూర్తి చేసుకున్న భారతీయ యువతలో ఉద్యోగ, ఉపాధిపై ఆశలు పెరిగాయి. అక్కడ ఉన్నత విద్య పూర్తిచేసిన భారతీయులు పలువురు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వేలాది మంది ఉన్నారు. ఇటీవల కొందరు ఉద్యోగాలు లభించక స్వదేశానికి తిరిగొచ్చారు. ఈ తరుణాన అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగడంతో గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన పారిశ్రామికవేత్త కూడా అయిన డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మిస్తానని హామీ ఇవ్వడంతో యువతలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఆశలు పెరిగినట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి వెళ్లిన యువత సైతం ట్రంప్‌కు ఉన్న అనుభవం, ఆయన పారిశ్రామిక విధానాలు తమకు ప్రయోజనం కలిగిస్తాయని బలంగా నమ్ముతున్నారు. పారిశ్రామిక వృద్ధి ఉంటుందని, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ప్రాధాన్యత పెరిగి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని విశ్వసిస్తున్నారు. అంతేకాక అమెరికాలో స్థిరపడిన భారతీయులు రక్షణ మరింతగా పెరుగుతుందని భావిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఉన్నత విద్య, ఉద్యోగాలు, ఉపాధి కోసం అమెరికా వెళ్లిన యువతలో పలువురి అభిప్రాయాలు కోరగా ఇలా వెల్లడించారు.

చిన్న తరహా పరిశ్రమలకు ప్రాధాన్యత



డొనాల్డ్ ట్రంప్ విజయంతో పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత పెరుగుతుంది. చిన్న తరహా పరిశ్రమలు పెరిగే అవకాశం ఉంది. పారిశ్రామిక విధానాలకు ట్రంప్ పెద్దపీట వేసే అవకాశాలు ఉన్నాయి. ఈ విధానంతో చదువు పూర్తి చేసుకున్న, చదువుతున్న యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది.

– పాశం సంతోష్‌రెడ్డి,
సౌత్ లియాన్, మిచిగన్ స్టేట్ (ఖమ్మం)

సమూలమైన మార్పులకు అవకాశం



ట్రంప్ విజయంతో ఇక్కడ సమూల మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన ట్రంప్ తిరిగి విజయం సాధించారు. అగ్రరాజ్యంలో ఆర్థిక విధానాలను పునర్నిర్మిస్తానని ఆయన ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ హామీ సమూల మార్పునకు దోహదపడే అవకాశముంది.

– మాదినేని వంశీ,
న్యూయార్క్ (ఇందిరానగర్, ఖమ్మం)

ఆర్థిక పునర్నిర్మాణంతో ప్రయోజనం



అమెరికా అధ్యక్షుడిగా విజయం సాధించిన ట్రంప్ ఎన్నికల వేళ ఆర్థిక పునర్నిర్మాణాన్ని వాగ్దానంగా ప్రకటించారు. ఇది దేశ ప్రయోజనాలను మరింతగా పెంచే అవకాశం ఉంది. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఇక్కడ అందరూ ఎంతో నమ్మకంగా ఉన్నారు.

– పత్తి ఇందు,
శాన్‌ఫ్రాన్సిస్కో (సారపాక, భద్రాద్రి జిల్లా)

ఐటీ రంగానికి ప్రోత్సాహం



ట్రంప్ పారిశ్రామికవేత్త కావడంతో ఐటీ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తారనే నమ్మకముంది. ఐటీ రంగాన్ని మరింతగా ప్రోత్సహించే అవకాశం ఉంది. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నాం. ప్రస్తుతం అమెరికాలో ఎంఎస్ చదువుతున్న భారతీయుల్లో ఆ నమ్మకం ఎక్కువగా ఉంది.

– గుండా హంసినీరెడ్డి, సెయింట్ లూయిస్,
మిస్సోరి (శ్రీనివాసనగర్, ఖమ్మం)

ఉద్యోగాలపై ఆశలు పెరిగాయి..



ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి అమెరికాకు వచ్చి ఎంఎస్ చదువుతున్నా. కొంతకాలంగా ఇక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బలహీనపడ్డాయి. దీంతో నాలాంటి పలువురిలో కొంత ఆందోళన ఉంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయంతో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయనే ఆశ పెరిగింది.

– రాధారపు శ్రీనిధి,
కెన్సాస్ సిటీ (బల్లేపల్లి, ఖమ్మం)

ఆందోళనల నుంచి ఉపశమనం



అమెరికా ఎన్నికల ఫలితం యువతకు ఉపశమనం కలిగించింది. ఉద్యోగ, ఉపాధి కోసం మన దేశంతో పాటు వివిధ దేశాల నుంచి పెద్దసంఖ్యలో అమెరికా వచ్చారు. ఎంఎస్ పూర్తయినా ఉద్యోగం లభించడం ఇబ్బందిగా ఉంది. ఇప్పుడు ట్రంప్ విజయంతో యువతలో ఆశలు పెరిగాయి.

– జి.సుదీప్, టెక్సాస్ (శ్రీరాంనగర్, ఖమ్మం రూరల్ మండలం)

దేశానికే తలమానికం.. భారజలం

- దేశంలోనే మొదట ఆక్సిజన్–18 ఉత్పత్తి మణుగూరులో..
- భవిష్యత్‌లో భారజలానికి పెరగనున్న డిమాండ్
- భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్యకుమార్



మాట్లాడుతున్న సీఈ సత్యకుమార్

అశ్వాపురం: దేశంలో అన్ని భారజల కర్మాగారాలకు మేటిగా 60 శాతం భారజలం ఉత్పత్తి చేస్తూ మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ తలమానికంగా నిలుస్తోందని భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో గల భారజల ఆస్పత్రి ఆవరణలో శనివారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 1991లో ఇక్కడ భారజల ఉత్పత్తి ప్రారంభమైందని, నేడు అగ్ర స్థానంలో ఉందని అన్నారు. ఈ కర్మాగారంలో ప్రస్తుతం ఎక్స్ఛేంజ్–1, ఎక్స్ఛేంజ్–2 యూనిట్లు ఉండగా 100 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఎక్స్ఛేంజ్–3 యూనిట్ నెలకొల్పే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇక్కడ డ్యూటీరియం డిప్లీటెడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు యోచనలో ఉన్నామని, ఇది కేన్సర్ నివారణకు ఉపయోగపడుతుందని చెప్పారు. భారజలానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, న్యూక్లియర్ రియాక్టర్లలో దీన్ని ఎక్కువగా వినియోగిస్తారని నాన్ న్యూక్లియర్ రియాక్టర్‌లైన ఎల్ఈడీ టీవీ, ఆప్టికల్ ఫైబర్, డ్రగ్స్ వంటి వాటిల్లోనూ వినియోగిస్తారని వివరించారు. బొగ్గుతో వాతావరణం కలుషితమవుతున్న నేపథ్యంలో న్యూక్లియర్ పవర్ ఉత్పత్తి వైపు అడుగులు పడుతున్నాయని తెలిపారు. దేశంలోనే మొదట మణుగూరు భారజల కర్మాగారంలో ఆక్సిజన్–18 ఉత్పత్తి ఇటీవల ప్రారంభమైందన్నారు. ఆక్సిజన్–18 ప్లాంట్ వంద శాతం విజయవంతమైందని, ఏడాదికి 10 లీటర్ల ఆక్సిజన్–18 ఎన్‌రిచ్‌డ్ వాటర్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఆక్సిజన్–18 ఐదు దేశాల్లో ఉత్పత్తి అవుతుండగా ఆరో దేశంగా భారత్ నిలిచిందన్నారు. దేశంలో భారజల నిల్వలకు కొరత లేదని, 23 న్యూక్లియర్ రియాక్టర్లు పని చేస్తున్నాయని, మరో 14 న్యూక్లియర్ రియాక్టర్లు నిర్మిస్తున్నామని చెప్పారు. సమావేశంలో మణుగూరు భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, డీజీఎం హెచ్‌కే.శర్మ, సీఈఓ రాజీవ్‌ప్రకాష్, ఐఆర్ఓ లత, ఏపీఓ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపై అపోహ వద్దు

- సమగ్ర సమాచారం ఇవ్వండి.. రహస్యంగా ఉంచుతాం
- అనుమానాలు ఉంటే తహసీల్దార్, ఎంపీడీఓ నివృత్తి చేస్తారు
- ఇల్లెందు, టేకులపల్లిలో సర్వేను తనిఖీ చేసిన కలెక్టర్ పాటిల్



ఇల్లెందులో ఓ కుటుంబసభ్యుల వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇల్లెందు/టేకులపల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేపై ప్రజలు అపోహలకు గురికావొద్దని, ప్రతీ ఒక్కరి సమాచారాన్ని రహస్యంగా భద్రపరుస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఏమైనా అనుమానాలుంటే స్థానిక తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు నివృత్తి చేస్తారని చెప్పారు. తొలిరోజు సర్వే తీరును ఇల్లెందు, టేకులపల్లి మండలం సులానగర్‌లో శనివారం ఆయన పరిశీలించారు. ఎన్యూమరేటర్లతో పాటు కలెక్టర్ సైతం కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించారు. రాజకీయాలతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయి.. సొంత ఇల్లు, ఇంటికి నీటి పంపు, భూమి ఎంత ఉంది అనే వివరాలపై ఆరా తీశారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్నాయా అంటూ వివరాలు అడిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే చేస్తోందని, దీని తర్వాతే ఏ పథకమైనా అమలవుతాయని అన్నారు. సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు సమగ్ర సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. సర్వే పేరుతో సైబర్ నేరగాళ్లు సైతం వచ్చి అకౌంట్ నంబర్లు, ఆధార్ నంబర్లు అడిగే ప్రమాదం ఉందని విలేకరులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఈ ప్రాంత వాసులనే ఎన్యూమరేటర్లుగా నియమించామని, వారి వద్ద కుటుంబ సర్వే పత్రాలు ఉంటాయని, అధికారులు కూడా ఆ ప్రాంతంలో పర్యటిస్తుంటారని తెలిపారు. ఎన్యూమరేటర్లకు తహసీల్దార్ జారీ చేసిన గుర్తింపు పత్రం కూడా అందజేసే ప్రయత్నం చేస్తామన్నారు. పెళ్లయిన వారు తల్లిదండ్రులతో కాకుండా వేరే కుటుంబంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. సర్వేతో తమ సమాచారం లీకవుతుందనే అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. బ్యాంక్ అకౌంట్ నంబర్లు అడగరని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కుటుంబసభ్యుల వివరాలు స్పష్టంగా, తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్లు కె.రవికుమార్, నాగభవానీ, ఎంపీడీఓలు ధన్‌సింగ్, జి.రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి వీసీలో..

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమగ్ర కుటుంబ సర్వేపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి కలెక్టర్ పాటిల్ హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతీ ఎన్యూమరేటర్ సమగ్ర సమాచారం నమోదు చేయాలని, సర్వే సమయంలో ప్రజల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సేకరించిన సమాచారాన్ని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వేలో ఆధార్, ధరణి పాసుబుక్, పాన్‌కార్డు, రేషన్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్లు నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీఓ సంజీవరావు, కలెక్టరేట్ ఏఓ రమాదేవి పాల్గొన్నారు.

నిధులు ఇచ్చినా పనులు సాగట్లే..

- ఇల్లెందు ఆస్పత్రి అభివృద్ధి పనులపై కలెక్టర్ అసహనం
- ఈనెల 20లోగా పూర్తి చేయాలని ఆదేశం

ఇల్లెందు : 'జిల్లాలోని ఇతర ప్రాంతాలకు ఇవ్వకుండా అన్ని నిధులూ మీకే ఇచ్చా.. అక్కడక్కడ రూ. ఐదారు లక్షలు ఇస్తే ఇల్లెందులో రూ.62 లక్షలు ఇచ్చా.. అయినా పనులు సాగడం లేదు' అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అసహనం వ్యక్తం చేశారు. ఈనెల 20లోగా అన్ని పనులు పూర్తి చేయాలని టీజీఎంఎస్ఐడీసీ ఏఈ సలీంను ఆదేశించారు. శనివారం ఆయన ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. 'నిధులున్నా నిష్ప్రయోజనం' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రూ.62 లక్షలు ఏ మేరకు ఖర్చు చేశారో ఆరా తీశారు. విద్యుత్ మరమ్మతులకు రూ.17.25లక్షలు, పై కప్పు లీకేజీకి రూ.25 లక్షలు, మరుగుదొడ్ల మరమ్మతుకు రూ.9లక్షలు ఖర్చు చేయాల్సి ఉండగా అన్ని పనులూ అసంపూర్తిగా ఉండడం, నాణ్యత లోపాన్ని తీవ్రంగా పరిగణించారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించగా.. ఇక్కడ పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు 18 నెలలుగా పీఎఫ్ కట్ చేసి ఖాతాల్లో జమ చేయడం లేదని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్‌ను కలెక్టర్ ఆదేశించారు.

స్థానిక సంస్థలకు అధికారాలు బదలాయించాలి

- లేకపోతే ఐక్య ఉద్యమాలు చేపడతాం
- పీఆర్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు యలమంచిలి

ఖమ్మంవన్‌టౌన్: గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం స్థాపనకు స్థానిక సంస్థలకు నిధులు, విధులు, అధికారాలు ఇవ్వాలని పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఖమ్మంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి పంచాయతీరాజ్ చాంబర్ సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు అన్ని రాష్ట్రాల్లో రాజ్యాంగం ప్రకారం నిధులు, విధులు, అధికారాలు తక్షణమే ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఐక్యపోరాటాలు చేస్తామని తెలిపారు. రాజకీయాలకతీతంగా గ్రామీణ ప్రజల సంక్షేమం, పంచాయతీరాజ్ సంస్థల మనుగడ కోసం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ మాట్లాడుతూ దేశంలోని 2.30లక్షలు గ్రామాలు, 90కోట్ల గ్రామీణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చాంబర్‌ను అన్ని రాష్ట్రాల్లో విస్తరించి ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం ఇస్తున్న నిధులను ఇతర కార్యక్రమాలకు బదలాయించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. తద్వారా సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నారని వాపోయారు. ఈ సమావేశంలో చాంబర్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల సత్యనారాయణరెడ్డి, బాదేపల్లి సిద్ధార్థతో పాటు బిర్రు ప్రతాపరెడ్డి, బెల్లం శ్రీనివాసరావు, వనపాక లక్ష్మీ ముత్యాలరావు, శ్రీశైలం, శంకర్‌యాదవ్, లోడిగ వెంకన్నయాదవ్, సామినేని హరిప్రసాద్, ధనుంజయయాదవ్, శశికళారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచొద్దు

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సురేంద్రమోహన్

వైరా: మార్కెట్ యార్డులో ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా త్వరగా కాంటా వేసి మిల్లర్లకు రవాణా చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్ ఆదేశించారు. వైరా మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం రాశులను శనివారం ఆయన పరిశీలించారు. రైతులు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయాన తాలు, తరుగు పోకుండా చూడాలని, ఎక్కువ రోజులు రైతులు వేచి ఉండకుండా త్వరగా మిల్లర్లకు పంపించాలని తెలిపారు. వైరా మార్కెట్ పరిధిలో వరి కోతలు 15 రోజుల్లో ముమ్మరమవుతాయని అధికారులు సురేంద్రమోహన్‌కు వివరించారు. డీఎస్ఓ చందన్‌కుమార్, డీఎంఓ అలీం, మైనింగ్ ఏడీ సాయికుమార్, ఏడీఏ కరుణశ్రీ, డీసీఎంఎస్ మేనేజర్ సందీప్, సివిల్ సప్లయీస్ డీటీ రామచంద్రరావు ఉన్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు 15 వరకు అవకాశం

కల్లూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ శీలం ఇందిర తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్ డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు మీసేవ, టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు 15వ తేదీలోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని, వివరాలకు 73829 29694 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మట్టి వాహనాలు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

బూర్గంపాడు: మండల పరిధిలోని చెరువు సింగారం గ్రామం వద్ద సీతారామ కెనాల్ గ్రావెల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గురువారం అర్ధరాత్రి టిప్పర్లతో అక్రమంగా రవాణా చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వాగ్వాదం నెలకొంది. గ్రామస్తుల సమాచారంతో రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని ఓ జేసీబీని, రెండు టిప్పర్లను పట్టుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ముజాహిద్ హెచ్చరించారు.

జ్యూయెలరీ దుకాణంలో షార్ట్ సర్క్యూట్

ఇల్లెందు: పట్టణంలోని ఓ జ్యూయెలరీ దుకాణంలో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఫర్నిచర్ దగ్ధమైంది. పట్టణంలోని ఆంబజార్‌కు చెందిన పూజ జ్యూయెలరీ షాపు నుంచి పొగలు వస్తుండగా శనివారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి యజమానితో పాటు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. కాగా శుక్రవారం రాత్రి షాప్ బంద్ చేసే క్రమంలో దీపం వెలిగించి వెళ్లారని, ఈ దీపం అక్కడి విద్యుత్ వైర్లకు అంటుకుని ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

గుడుంబా స్థావరాలపై దాడులు

గుండాల: నిషేధిత గుడుంబా స్థావరాలపై శనివారం రాత్రి ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేసి, సారా, బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఎస్సై అబ్బారావు కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండలం అనంతోగు గ్రామంలో నాటు సారా తయారు చేస్తున్నారనే సమాచారం రావడంతో దాడులు చేశారు. ఇద్దరు ఇళ్లలో లీటరు సారా, 3 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై..

దమ్మపేట: మండల పరిధిలోని పార్కలగండి గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పార్కలగండి గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సాయికిషోర్ రెడ్డి, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకోగా, నలుగురు వ్యక్తులు పరారయ్యారు. కోడి పుంజు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.1,530 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

సన్న రకాలకు బోనస్

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు లేకుండా చర్యలు

- గ్రీన్ క్యాలిబర్, ఐరిస్ యంత్రాల ద్వారా రకాల గుర్తింపు
- ఈసారి జిల్లాలో 160 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

పాల్వంచరూరల్: జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వానాకాలం వరి ధాన్యం సేకరణ ప్రారంభమైంది. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించారు. వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతుండటంతో మరికొన్ని మండలాల్లో కేంద్రాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వానాకాలం పండించిన సన్నరకాల ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించేలా చర్యలు చేపట్టింది.

వానాకాలంలో వరిసాగు వివరాలు

జిల్లాలో 1,61,550 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరిసాగు చేశారు. గతేడాది 2 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టారు. ఈ సారి గతేడాది కంటే కొంత తగ్గింది. కాగా సన్న రకాలు 1.54 లక్షల ఎకరాల్లో, దొడ్డు రకం ధాన్యం 7,300 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది దిగుబడి అంచనా 3,25,000 మెట్రిక్ టన్నులుగా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో రైతుల అవసరాల నిమిత్తం 1,30,000 మెట్రిక్ టన్నులు పోగా, మిగిలిన 2,95,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు వస్తుందని అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 160 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా, ఇందులో పీఏసీఎస్‌కు 117, డీఆర్‌డీఏకు 3, డీసీఎంఎస్‌కు 10, జీసీసీకి 30 కేంద్రాలను కేటాయించారు. అయితే ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు.



గ్రీన్ క్యాలిబర్ యంత్రాన్ని నిర్వాహకుడికి అందజేస్తున్న దృశ్యం

సన్నాలను గుర్తించేందుకు గ్రీన్ క్యాలిబర్ యంత్రాలు

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈసారి ధాన్యం విక్రయించే రైతులను ఐరిస్ కెమెరాల ద్వారా ఫొటోలు తీసుకుని కొనుగోలు చేయనున్నారు. జిల్లాలో 160 ఐరిస్ యంత్రాలతోపాటు మైక్రో మీటర్లు, గ్రీన్ క్యాలిబర్ యంత్రాలను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందుబాటులో ఉంచనున్నారు. ధాన్యం కేంద్రానికి వచ్చాక గ్రీన్ క్యాలిబర్ యంత్రాలతో సన్న రకమా, లేక దొడ్డు రకమా అని గుర్తిస్తారు. ధాన్యం గింజ పొడవు 6మిల్లీమీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదు. వెడల్పు రెండు మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. తేమశాతం 17 లోపు ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయనున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ నంబర్, రైతు బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్‌లు అధికారులకు అందిస్తే, ధాన్యం విక్రయించే రైతు సెల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ప్రభుత్వం మద్దతు ధరతోపాటు అదనంగా బోనస్ రూ.500 చెల్లించనుండగా, 33 రకాలకు బోనస్ వర్తింపజేశారు.



ఐరిస్ యంత్రం

పారదర్శకత కోసమే..

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా మైక్రోమీటర్లు గ్రీన్ క్యాలిబర్, ఐరిస్ యంత్రాలను అందుబాటులో ఉంచుతున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలకు చోటులేకుండా 160 ఐరిస్ యంత్రాలను అందించాం.

–ఎస్.త్రినాథ్‌బాబు, జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్

టార్పాలిన్లు, గ్రీన్ క్యాలిబర్లు ఇచ్చాం..

ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో దొడ్డు, సన్నరకం ధాన్యాలను గుర్తించే గ్రీన్ క్యాలిబర్లు 160, ధాన్యం క్లీనర్లు అందించారు. మరో 35 వాటికి అవే ఎత్తిపోసుకునే ప్యాడీ క్లీనర్లు, 700 టార్పాలిన్ పట్టాలను నిర్వాహకులకు అందుబాటులో ఉంచాం.

–నరేందర్, జిల్లా మార్కెటింగ్ మేనేజర్

తప్పుల్లేకుండా సర్వే చేయండి

అదనపు కలెక్టర్ విద్యాచందన



జగన్నాథపురంలో సర్వేను పరిశీలిస్తున్న విద్యాచందన

పాల్వంచరూరల్ : తప్పులు దొర్లకుండా ప్రతీ కుటుంబాన్ని సర్వే చేయాలని అదనపు కలెక్టర్ విద్యాచందన ఎన్యూమరేటర్లను ఆదేశించారు. మండలంలోని జగన్నాథపురంలో చేపట్టిన ఇంటింటి సర్వేను శనివారం ఆమె పరిశీలించారు. కుటుంబ వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీఓ బొగ్గ నారాయణ, కార్యదర్శులు సాయిరాం, మోషే పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో జెడ్పీ సీఈఓ..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట, పేరాయిగూడెం గ్రామాల్లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని, ఆయా కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. గృహ యజమానులు అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీఓ సోయం ప్రసాద్, కార్యదర్శి రామ్మూర్తి ఉన్నారు.

సర్వేలో గ్రామం పేరు తికమక

చంద్రుగొండ : మండల పరిధిలోని వెంకటియాతండా పంచాయితీలో మారుమూల గ్రామం కరిశెలబోడుతండా ఉంది. అయితే గతంతో పులిగుండం /పులిగుండాల అని పిలిచేవారు. ఇదే రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. కానీ ప్రస్తుతం గ్రామస్తులు కరిశెలబోడుతండాగా పిలుచుకుంటున్నారు. సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చిన సిబ్బందితో తమ ఊరిపేరు పులిగుండం కాదని, కరిశెలబోడు అని రాయాలని గిరిజనులు కోరుతున్నారు. దీంతో ఎన్యూమరేటర్లు సమస్యను శనివారం తహసీల్దార్ సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లగా.. రికార్డులో ఉన్న ప్రకారమే సర్వే నిర్వహించాలని సూచించారు.



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న ఎన్యూమరేటర్లు

ఎమ్మెల్యే తెల్లం ఇంట సమగ్ర సర్వే

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఇంట్లో శనివారం సమగ్ర కుటుంబ సర్వే సిబ్బంది వివరాలు సేకరించారు. ఇంటికి వచ్చిన సర్వే సిబ్బందికి ఎమ్మెల్యే తెల్లం పూర్తి స్థాయిలో సహకరించి వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే డివిజన్‌లోని ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.



సర్వే బృందానికి వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

ముఠా పనికీ ముడుపులు..?

- ఆయిల్‌ఫెడ్‌లో పెచ్చుమీరుతున్న అవినీతి
- అధికార పార్టీ నాయకులకూ వాటా..?

అశ్వారావుపేట: ప్రభుత్వరంగ సంస్థ అయిన టీజీ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీలో గెలలను అన్‌లోడ్‌చేసే ముఠా పనికీ రూ.2.5 లక్షలు లంచం అడుగుతున్నట్లు సమాచారం. 2005లో అశ్వారావుపేటలో ఆయిల్‌ఫెడ్‌కు చెందిన క్రూడ్ ఆయిల్ పాం ప్రాసెసింగ్ యూనిట్ (పామాయిల్ ఫ్యాక్టరీ)ని అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆయిల్‌ఫెడ్ విస్తరణలో భాగంగా దమ్మపేట మండలం అప్పారావుపేటలో 2016లో అత్యాధునిక ఆయిల్‌పాం ఫ్యాక్టరీని ఆయిల్‌ఫెడ్ నిర్మించింది. అప్పటి నుంచి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన దమ్మపేట మండల నాయకులకు అప్పారావుపేట ఫ్యాక్టరీ బంగారు బాతులా మారిందనే విమర్శలు ఉన్నాయి. అప్పారావుపేట ఆయిల్ పాం కర్మాగారంలో ఆయిల్‌పాం గెలలను అన్‌లోడ్ చేసి.. కన్వేయర్‌బెల్ట్ మీదకు పడేయటం.. ఫ్యాక్టరీలో ఇతర భారమైన పనులు చేసేందుకు ముఠా కూలీలు కావాలి. వీరిని లేబర్ కాంట్రాక్టర్ నియమించుకుంటారు. టన్నుకు కాంట్రాక్టర్ ఒప్పందం మేరకు ఆయిల్‌ఫెడ్ నగదు చెల్లిస్తుంది. రోజువారీ కూలీ ప్రకారం ముఠా కూలీలకు కాంట్రాక్టర్ చెల్లిస్తారు. ఈ విధంగా చేసే కాయకష్టానికి కొలవు కావాలంటే మధ్యవర్తులు రూ.2.5 లక్షలు లంచం అడుగుతున్నట్లు సమాచారం. దమ్మపేటకు చెందిన ఓ వ్యక్తి తనకు పని కావాలంటూ ఫ్యాక్టరీ చుట్టూ తిరుగుతున్నా.. మేనేజర్ నుంచి ముఠా మేస్త్రీ వరకు వేడుకున్నా.. కొలువు దక్కలేదు. కానీ రూ.2.5 లక్షలు మధ్యవర్తి చేతులో పెట్టిన వారికి ముఠా పని దక్కినట్లు సమాచారం. లంచంలో రాజకీయ నాయకులకూ వాటాలున్నాయని ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ విషయాలను ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లగా.. ముఠా పని ఇచ్చేందుకు రూ.2.5 లక్షలు వసూలు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని.. వసూళ్లకు పాల్పడవద్దని హెచ్చరించినట్లు తెలిపారు.



ఆయిల్‌పాం గెలలను కన్వేయర్‌కు లోడ్ చేస్తున్న ముఠా కూలీలు (ఫైల్)

రాష్ట్రస్థాయి బాలికల ఖో–ఖో పోటీలు ప్రారంభం

అండర్–17 విభాగంలో నిర్వహణ

కల్లూరు: తెలంగాణ రాష్ట్రస్థాయి 68వ అండర్–17 బాలికల ఖో–ఖో పోటీలు శనివారం సాయంత్రం కల్లూరులో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులతో పాటు 20 మంది కోచ్‌లు, 50 మంది న్యాయనిర్ణేతలు, 25 మంది వలంటీర్లు హాజరయ్యారు. కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎంఈఓ పి.నివేదిత ప్రారంభించి.. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొత్తం 20 లీగ్ మ్యాచ్‌లు, నాలుగు నాకౌట్ మ్యాచ్‌లు నిర్వహించనుండగా, ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేసి ఉత్తరప్రదేశ్‌లో డిసెంబర్ 5 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని పరిశీలకులు ఎస్.శివరామ్ తెలిపారు. ఖో–ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.నరసింహమూర్తి, రిటైర్డ్ పీడీ ఎస్కే ముస్తఫా, హెచ్ఎం శ్రీహరితో పాటు పసుపులేటి వీరరాఘవయ్య, బి.భీమా నిర్వహణ బాధ్యతలు చేపట్టగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ నివేదిత



టోర్నీకి హాజరైన క్రీడాకారులు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అశ్వాపురం: అశ్వాపురం పోలీసులు శనివారం అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన గాజర్ల కళ్యాణ్(25)తో అశ్వాపురం మండలం అమెర్ద కాలనీ గ్రామానికి చెందిన స్వరూపకు వివాహం జరిగింది. దంపతులు హైదరాబాద్‌లో నివాస ఉంటుండగా, కళ్యాణ్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కులగణన పేరుతో ఇటీవల ఇంటికి వచ్చాడు. అమెర్ద కాలనీలో అత్త గారింటికి వచ్చిన కళ్యాణ్ శనివారం బంధువుల ఇంట్లో షెడ్ వేసేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి మధ్యాహ్నం నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా కళ్లు తిరిగి కింద పడి తలకు బలమైన గాయాలయ్యాయి. ఆటోలో మణుగూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా తమ కుమారుడిని అత్తింటి వారే చంపారని మృతుడి తల్లిదండ్రులు ఆరోపించారు. వారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

54 బైక్‌లు, రెండు ఆటోలు సీజ్

పాల్వంచ: పట్టణంలోని వనమా కాలనీ, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీల్లో శనివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయా కాలనీల వద్ద పోలీసు బలగాలు మోహరించారు. బయటి వ్యక్తులను లోపలికి రాకుండా, లోపలి వారిని బయటకు వెళ్లకుండా కొంత సేపు నిలుపుదల చేశారు. ఇంటింటికి తిరిగి సోదాలు నిర్వహించారు. జాగిలాలతో పరిశీలించారు. సరైన పత్రాలు లేని 54 మోటార్ సైకిళ్లు, 2 ఆటోలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పాల్వంచ పట్టణ, మండల, ములకలపల్లి, బూర్గంపాడు ఎస్‌ఐలు సుమన్, రాఘవయ్య, జీవన్, సురేష్, రాజశేఖర్, నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు సీజ్ చేసిన మోటార్ సైకిళ్లు

పాత కక్షలతో దాడి

పాల్వంచ: పాతకక్షల నేపథ్యంలో డెకరేషన్ పనులు చేసే వ్యక్తుల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన చినుముల ఆకాష్, వాసు, శివలు డెకరేషన్ పనులు చేస్తుంటారు. ఆకాష్, అతని అన్న వెంకటేష్ కలిసి ఈ నెల 7న ఇంటికి వెళుతున్న క్రమంలో వాసు, శివలు పాత కక్షల నేపథ్యంలో అడ్డుకుని దాడి చేశారు. కొడవలితో గాయపర్చారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఏకలవ్య' విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..?

దుమ్ముగూడెం : మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏకలవ్య పాఠశాలలో వారం రోజుల క్రితం చోటు చేసుకున్న ఓ ఘటనకు సంబంధించి సిబ్బంది ఆమెను బుధవారం ఇంటికి పంపించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన విద్యార్థిని శనివారం ఉదయం ఇంట్లో ఉన్న కలుపుమందు తాగింది. గమనించిన తల్లి చుట్టుపక్కల వారి సహకారంతో 108 ద్వారా భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. విద్యార్థినిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యువకుడి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ బొల్లినగర్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి మందలించడంతో గ్రామానికి చెందిన గూళ్ల రాజు (21) శుక్రవారం నొప్పికి సంబంధించిన 10 ట్యాబ్‌లెట్లు మింగాడు. కొద్ది సేపటికి కడుపులో నొప్పిగా ఉండటంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మావోయిస్టు పార్టీ సానుభూతిపరుల అరెస్ట్

చర్ల: ఆరుగురు మావోయిస్టు పార్టీ సానుభూతిపరులను శనివారం చర్ల పోలీసులు అరెస్టు చేశారు. భద్రాచలం ఇన్‌చార్జి డీఎస్పీ వి. రవీందర్‌రెడ్డి భద్రాచలంలోని పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు, టేకు ప్లాంటేషన్ సమీపంలో ఏరియా డామినేషన్‌లో భాగంగా చర్ల సివిల్, స్పెషల్‌పార్టీ, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్, సీఆర్‌పీఎ 81 బెటాలియన్‌ల పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరి వద్ద ప్రెజర్ కుక్కర్ బాంబు లభ్యమైంది. విచారించగా వారు చెన్నాపురానికి చెందిన మడకం దేవా, సోడి ఉంగ, సోడి కోస, మడకం ఇడమ, కొవ్వాసి బీమయ్యలుగా తేలింది. మావోయిస్టు నేతల ఆదేశాల మేరకు ప్రెజర్ కుక్కర్ బాంబును వినియోగించి కూంబింగ్‌కు వచ్చే పోలీసు బలగాలను మట్టుబెట్టాలని వస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. గత నెల 17న కూడా గోరుకొండ సమీపంలో ప్రెజర్ కుక్కర్ బాంబును ఏర్పాటు చేసి పేల్చినట్లు ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో చర్ల సీఐ ఏ రాజువర్మ, ఎస్సై ఆర్ నర్సిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ 141, 81 బెటాలియన్ల అధికారులు ఉన్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: ఒడిశా సరిహద్దు నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న నిషేధిత గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్, అంబేడ్కర్ సెంటర్, కూనవరం రోడ్డు ఆర్టీఏ కార్యాలయం వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మూడు ద్విచక్ర వాహనాలపై ఐదుగురు వ్యక్తులు 25.22 కేజీల గంజాయి తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నిందితులు మహమ్మద్ ఫజిల్, వంగ అరవింద్, కోరి రోహన్ కాటేదాస్, ఠాకూర్ విశ్వస్, నూర్ మహమ్మద్‌లను అరెస్ట్ చేసి, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐలు రమేష్, రహీం మున్నీసా బేగం తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తల్లాడ: పోలీసులకు ఫిర్యాదు చేశారనే భయంతో పురుగులమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నరసింహారావుపేటకు చెందిన ముదిగొండ నరసింహారావు (50) ఆదే గ్రామానికి చెందిన సుంకర సత్యనారాయణ ఈ నెల 4న భూమి విషయమై గొడవ పడ్డారు. దీంతో సత్యనారాయణను నరసింహారావు గొడ్డలితో గాయపర్చాడు. సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా నరసింహారావు భయంతో పురుగులమందు తాగాడు. ఆయనను బంధువులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై శనివారం ఆయన కుమారుడు అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జగిత్యాల తీసుకెళ్తున్న చేపపిల్లలు మృతి

కొణిజర్ల: డీసీఎం, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యాన్‌లోని ట్యాంకు బోల్తా పడటంతో చేపపిల్లలు మృతి చెందాయి. కొణిజర్లలో శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని భీమవరం నుంచి చేప పిల్లల లోడ్‌తో డీసీఎం వ్యాన్ జగిత్యాలకు వెళ్తుండగా ఖమ్మం నుంచి వైరా వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడనకున్నా డీసీఎం నుంచి చేప పిల్లల ట్యాంకు కింద పడటంతో పిల్లలన్నీ చనిపోయాయి. పోలీసులు చేరుకుని వ్యాన్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

టీడీపీ అసభ్యకర పోస్టులపై డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

- వైఎస్ జగన్, ఇతర నేతలపై అసభ్య పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి
- ఆధారాలనూ సమర్పించిన నేతలు
- రెండు, మూడు రోజులు వేచి చూస్తామని నేతల వెల్లడి.. చర్యలు తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టీకరణ
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అక్రమ కేసులు పెడుతున్నారు: అంబటి
- పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ, చిత్ర హింసలకు గురి చేస్తున్నారు
- సుధారాణిపై సీఐ దాడినీ డీజీపీకి వివరించాం
- దౌర్జన్యకాండపై పోరాటం చేస్తాం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వ్యవస్థీకృత నేర రాజకీయాల్లో చంద్రబాబు బరితెగింపు

ఎక్స్ వేదికగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి, అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్గనైజ్డ్ క్రైమ్ (వ్యవస్థీకృత నేరాలు)తో కూడిన పాలిటిక్స్ (రాజకీయాలు) సాగిస్తూ చంద్రబాబు మరింతగా బరి తెగించారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి 100 రోజుల పాలన, మోసాలు, వైఫల్యాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చంద్రబాబు సృష్టించిన అబద్ధాన్ని ఎల్లో మీడియా మోయడం.. ఆ తర్వాత ఆ పార్టీల నాయకులు, వారిని మోస్తున్న అధికారులు ప్రజల్లో అశాంతిని రేపేలా చర్యలు, కార్యక్రమాలు చేయడం ఒక పన్నాగం ప్రకారం జరిగాయని ఎత్తి చూపారు. 'ఈ నేపథ్యంలో వ్యవస్థీకృత నేరాల కింద అరెస్టు చేయాల్సింది ఎవరిని? జీవిత ఖైదు వేయాల్సింది ఎవరికి? చంద్రబాబుకు కాదా?' అంటూ శనివారం 'ఎక్స్' వేదికగా సోషల్ మీడియాపై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను ఎండగడుతూ పోస్టు చేశారు. ఆ పోస్టులో జగన్ ఏమన్నారంటే..

1 దొంగే ఎదుటివారిని పట్టుకుని దొంగా అన్నట్టుగా చంద్రబాబు తీరు ఉంది. నలభై ఏళ్లుగా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న చంద్రబాబు ఇప్పుడు కూడా అదే చేస్తూ ఎదుటివారి మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తన స్కాంలు బయటపడుతున్నాయని, తాను చేసిన అవినీతి బయటకు వస్తోందని, తన పాలనా వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతున్నారనే దురహంకారంతో ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా గొంతు విప్పుతున్నవారిని, ముఖ్యంగా చంద్రబాబు తప్పులను నిలదీస్తున్న యువతను లక్ష్యంగా చేసుకుని చట్టవిరుద్ధంగా, అన్యాయంగా, అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. తన అడుగులకు మడుగులొత్తే పోలీసులను వాడుకుంటూ వారిపై భౌతిక దాడులు చేయిస్తూ, హింసిస్తున్నారు. ఇది ఆర్గనైజ్డ్ క్రైం కాదా?



2 ఎలాగూ చంద్రబాబు చేతిలోనే దాదాపుగా అన్ని పేపర్లు ఉన్నాయి. కాస్తోకూస్తో ప్రజాసమస్యలపై గొంతు విప్పే టీవీలను కూడా వ్యవస్థీకృతంగా దెబ్బ తీశారు. కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తెచ్చి వాటి ప్రసారాలను ప్రజలకు చేరనీయకుండా పలు మార్లు కట్ చేశారు. ఇక చంద్రబాబుకు కొరుకుడుపడనిది ఒకే ఒక్కటి. అదే సోషల్ మీడియా. అందుకే చంద్రబాబు ఇలా బరితెగిస్తున్నారు. ఇలా ఒక చేత్తో తన మీడియాను, మరో చేత్తో వ్యవస్థలను, ఆ వ్యవస్థల్లోని తన మనుషులను వాడుకుని నాలుగు దశాబ్దాలుగా చంద్రబాబు చేస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్స్ చూస్తూనే ఉన్నాం. మరి ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌కు పాల్పడుతున్నది ఎవరు?

3 ప్రజలకు మంచిచేసి కాకుండా, మభ్యపెట్టి, మోసం చేసి, అబద్ధాలు ఆడి అధికారంలోకి రావాలని, అధికారంలో ఉంటే దాన్ని ఇలాగే నిలబెట్టుకోవాలన్నది చంద్రబాబు సిద్ధాంతం. దీనికోసం చంద్రబాబుగారు ఒక అబద్ధాన్ని సృష్టిస్తారు. దానికి రెక్కలు తొడిగి తన ఎల్లోమీడియా ద్వారా శరవేగంగా వ్యాపింపచేస్తారు. దానిపైనే వారి పార్టీ నాయకులచేత మాట్లాడిస్తారు. పనిలోపనిగా దత్తపుత్రుడిని, ఇతర పార్టీల్లో తనకు అనుకూలంగా ఉన్నవారినికూడా దీనికి వాడుకుంటారు. ఆ తర్వాత డిబేట్లు చేయిస్తారు. దీనికి మరిన్ని అవాస్తవాలు జోడించి తన కుమారుడు లోకేశ్ ద్వారా సోషల్ మీడియాలో విష ప్రచారం చేయిస్తారు. వాళ్లే ఆరోపణలు చేసి, వాళ్లే మీడియా ట్రయల్ చేసి, వాళ్లే దోషులెవరో నిర్ధారించి, వాళ్లే శిక్షలు విధిస్తారు. ఒక పథకం ప్రకారం, మాఫియా ముఠా మాదిరిగా చంద్రబాబు ఈ నేరాలు చేస్తూనే ఉన్నారు. ప్రత్యర్థి పార్టీలను దెబ్బ తీయడానికి, రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వ హననానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటారు. మరి ఇది వ్యవస్థీకృత నేరం కాదా?

4 అయ్యా చంద్రబాబూ, మీ పార్టీ టీడీపీ అధికారిక సోషల్ మీడియా అకౌంట్లో మీరే ఫేక్ న్యూస్‌పెట్టి, దాన్ని మీరే ప్రాపగండా చేసిన లేటెస్ట్ ట్వీట్‌ను రాష్ట్ర ప్రజలంతా గమనించారు. ఎప్పుడో రెండేళ్ల కిందట మా అమ్మ కారు టైర్ బరస్ట్ అయితే, అప్పటి వీడియోను ఇప్పుడు బయటకు తీసి, లేటెస్ట్‌గా ఇప్పుడే జరిగినట్టుగా, మీరు ట్వీట్‌లో పెడుతూ, నా తల్లిని నేను చంపాలని అనుకున్నానని సిగ్గుమాలిన రీతిలో వ్యక్తిత్వ హననానికి నువ్వు దిగావు. దీన్ని ఖండిస్తూ మా అమ్మ లేఖ రాస్తే దాన్నికూడా ఫేక్ లెటర్‌గా పేర్కొంటూ నువ్వు పబ్లిసైజ్ (ప్రచారం) చేయడం సిగ్గుమాలిన చర్య కాదా? మళ్లీ మా అమ్మ వీడియో మెసేజ్ కూడా ఇస్తూ మీ తీరును దుయ్యబట్టింది. ఇంతలా ఉద్దేశ పూర్వకంగా వ్యక్తిత్వ హననం చేసిన నిన్ను, నీ కొడుకును ఇదే పోలీసులు ఎందుకు అరెస్టు చేయడం లేదు? ఇలాంటివి శతకోటి మీ ఏబీఎన్, మీ ఈనాడు, మీ టీవీ-5, మీ అనుకూల మీడియా ఎన్ని చేసినా పోలీసులు ఏనాడైనా చర్యలు తీసుకున్నారా? నువ్వు చేస్తే ఏదైనా మంచే! కాని నువ్వు చేసిన తప్పుడు పనులను, ప్రజా వ్యతిరేక చర్యలను ఎవరైనా ప్రశ్నిస్తే అది చెడు అవుతుందా? వారిపై కేసులు పెట్టి వారిని హింసించడం ధర్మమేనా?

5 కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్గనైజ్డ్ క్రైమ్‌తోకూడిన పాలిటిక్స్‌లో చంద్రబాబు మరింతగా బరితెగించారు. మొన్నటి తిరుమల లడ్డూ వ్యవహారం వరకూ జరిగిన అనేక పరిణామాలు దీనికి ఉదాహరణ. కూటమి 100 రోజుల పాలన, మోసాలు, వైఫల్యాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చంద్రబాబు సృష్టించిన అబద్ధాన్ని ఎల్లోమీడియా మోయడం, ఆ తర్వాత ఆ పార్టీల నాయకులు, వారిని మోస్తున్న అధికారులు ప్రజల్లో అశాంతిని రేపేలా చర్యలు, కార్యక్రమాలు చేయడం ఒక పన్నాగం ప్రకారం జరిగాయి. మరి వ్యవస్థీకృత నేరాల కింద అరెస్టు చేయాల్సింది ఎవరిని? జీవిత ఖైదు వేయాల్సింది ఎవరికి? చంద్రబాబుకు కాదా?

అరాచకానికి పరాకాష్ట



ఏపీలో అక్రమ కేసులు.. నిర్బంధాలు.. చిత్రహింసలు విక్రృత క్రీడ.. ● చంద్రబాబు ప్రభుత్వ రాక్షసానందం

- ఇష్టానుసారం కక్ష సాధింపులతో పౌర హక్కుల హననం
- పాలకులను ప్రశ్నిస్తే దండన తప్పదని సరికొత్త ఆదేశం
- జీ హుజూర్ అంటూ పోలీసు శాఖ అత్యుత్సాహం
- సుప్రీంకోర్టు, హైకోర్టు హెచ్చరికలు సైతం బేఖాతర్.. ఇప్పటికే వందలాది మందిపై తప్పుడు కేసులు

సాక్షి, అమరావతి : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వారిపైకి పోలీసులను ఉసిగొలుపుతోంది. రాజ్యాంగ ధర్మాన్ని మంటగలుపుతూ పౌర హక్కులను కాలరాస్తోంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు చట్టం, రాజ్యాంగం అనే వాటికి తిలోదకాలు వదిలారు. అధికార పార్టీల నేతలు చెప్పిన వారందరిపై ఉన్నవీ లేనివీ కల్పించి ఎక్కడికక్కడ తప్పుడు కేసులు పెడుతున్నారు. ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులతో విరుచుకుపడుతున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని 24 గంటల్లో న్యాయస్థానంలో హాజరు పరచాలన్న చట్టాన్ని నిర్భీతిగా ఉల్లంఘిస్తున్నారు. మహిళలు, వృద్ధులు, మైనర్లు అని కూడా చూడకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ చిత్రహింసలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు అర్ధరాత్రి, అపరాత్రి అని కూడా చూడకుండా ఊళ్లపై పడి బీభత్సం సృష్టిస్తున్నారు. నిద్రిస్తున్న వారిని అపహరించుకుపోతున్నారు. ఎక్కడికి తీసుకువెళుతున్నారో చెప్పరు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి అడిగితే మాకేం తెలీదనే సమాధానం వస్తుంది. పోలీసు వాహనాల్లో కుక్కి.. కొడుతూ ఎక్కడెక్కడో తిప్పుతున్నారు. గుర్తు తెలియని ప్రదేశాల్లో నిర్బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఎందుకు కొడుతున్నారని అడిగితే లాఠీలే సమాధానమిస్తున్నాయి. మేం చేసిన తప్పేమిటని ప్రశ్నిస్తే పోలీసుల బూట్లే మాట్లాడుతున్నాయి. ఒక్కొక్కరిపై రెండు మూడు అక్రమ కేసులు నమోదు చేస్తూ ఒక పోలీస్ స్టేషన్ నుంచి మరో పోలీస్ స్టేషన్‌కు తిప్పుతున్నారు. మూడు నాలుగు రోజుల్లోనే ఏకంగా 110కి పైగా అక్రమ కేసులు నమోదు చేయడం ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనం. ఇవన్నీ బాధితుల తరపున లాయర్లు, గ్రామ పెద్దలు నిలదీస్తేనే అధికారికంగా ప్రకటించినవి కావడం గమనార్హం. అరెస్టు చూపకుండా వేధిస్తున్న కేసులు వేలల్లో ఉన్నాయనడం అక్షర సత్యం. ఒక్కో కేసులో ఒకరు మొదలు 10–20 మందిని సైతం నిందితులుగా చేరుస్తూ వేధిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా అరెస్ట్ చేయకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును సైతం బేఖాతరు చేస్తున్నారు. 41 ఏ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలన్న ఆదేశాలు పట్టవన్నట్టు చెలరేగిపోతున్నారు. బాధిత కుటుంబాలు హెబియస్ కార్పస్ పిటీషన్లతో హైకోర్టును ఆశ్రయించినా తమ నియంతృత్వాన్ని నిర్భీతిగా సమర్థించుకోవడం దుర్మార్గం. ఇదీ చంద్రబాబు మార్కు పోలీసు రాజ్యం.

మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగం!

సోషల్ మీడియా యాక్టివిస్ట్ పెద్దిరెడ్డి సుధారాణి పట్ల పోలీసులు మహిళ అని కూడా చూడకుండా అత్యంత క్రూరంగా వ్యవహరించడం దారుణం. మూడు రోజుల పాటు ఆమెను, ఆమె భర్తను చిత్రహింసలకు గురిచేశారు. 'నన్ను ఈ నెల 5వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. నా భర్త వెంకటరెడ్డినీ చిత్రహింసలకు గురిచేశారు. చిలకలూరిపేట సీఐ రమేష్ దుర్భాషలాడారు. నోరెత్తితే ఇష్టానుసారం కొట్టారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల వద్ద జొన్నవాడలోని రాజరాజేశ్వరి ఆలయానికి వెళ్లినప్పుడు మమ్మల్ని పల్నాడు జిల్లా చిలకలూరిపేట సీఐ రమేష్ బృందం అదుపులోకి తీసుకుంది. చిలకలూరిపేట, ఒంగోలుకు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు' అని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. తుదకు ఆమె తరపు వారు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడంతో శుక్రవారం సాయంత్రం కొత్త పేట పోలీసులు గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టారు. ఇదే విషయాన్ని ఆమె మెజిస్ట్రేట్ ఎదుటే చెప్పారు. పోలీసులు కొట్టడంతో అయిన గాయాలను చూపించారు. ఈమెపై 6 అక్రమ కేసులు బనాయించారు.

శాంతిభద్రతలు నిల్.. వేధింపులు ఫుల్!

వరుస హత్యలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలతో ఏపీ అట్టుడుకుతోంది. వీటిని అరికట్టాల్సిన చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. టీడీపీ గూండాలు కర్రలు, కత్తులతో గ్రామాలపై పడి బీభత్సం సృష్టిస్తున్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో 177 మంది హత్యకు గురయ్యారు. 500కుపైగా హత్యాయత్నాలు జరిగాయి. 2 వేలకుపైగా దాడులతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారింది. టీడీపీ గూండాల దాడులతో భీతిల్లి దాదాపు 3 వేల కుటుంబాలు గ్రామాలు విడిచిపెట్టి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాయి. అత్యాచార పర్వానికి అంతు లేకుండా పోయింది. నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో 110 మందిపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరిగాయి. అయినా శాంతిభద్రతలతో తమకు సంబంధం లేదన్నట్లు సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఓ ముస్లిం బాలిక కిడ్నాప్‌కు గురికాగానే ప్రభుత్వం స్పందించి ఉంటే ఇప్పుడు ఆ అమ్మాయి బతికుండేది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు జాన్ 16 ఏళ్ల బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడితే ఏ మేరకు శిక్ష వేశారో పాలకులే చెప్పాలి.

ఇది నేరమట!



శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో ఈనెల 1వ తేదీన బైనపల్లి దానమ్మ అనే వృద్ధురాలు పింఛన్ కోసం గంటలతరబడి వేచి ఉంటూ సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు వెంటనే ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఇదే విషయాన్ని అదే మండలం కొండపల్లి గ్రామ ఉప సర్పంచ్ మద్దు జస్వంత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇతని పాలిట ఇదే పాపమైపోయింది. పాలక పార్టీ పెద్దల ఆదేశాలతో పోలీసులు అక్రమంగా కేసు పెట్టారు. అంతటితో ఆగకుండా ఆయన్ను భయపెట్టాలని కూడా ఆదేశించారు. దీంతో పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. అప్పుడు ఆయన ఇంట్లో లేడు. గంటల కొద్దీ అక్కడే ఉండి ఆయన కుటుంబ సభ్యులను మానసికంగా వేధించారు. ఆ తర్వాత ఎటువంటి నోటీస్ ఇవ్వకుండానే జస్వంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ రోజు కార్తీక పూజ నిర్వహిస్తున్నామని, భోజనం చేసి వస్తానన్నా కూడా వదల్లేదు. ఫోన్‌ను కూడా లాగేసుకున్నారు. ఏం కేసు పెట్టారని అడిగినా అప్పుడు చెప్పలేదు. తర్వాత లాయర్ సాయంతో బయటకు వచ్చాడు. అయినా ఇప్పటికీ ఫోన్ చేస్తూ ఎప్పుడుపడితే అప్పుడు స్టేషన్‌కు రావాలంటూ ఫోన్లు చేసి పిలిపిస్తూ మానసికంగా వేధిస్తున్నారు. 192 బీఎన్ఎస్ సెక్షన్‌తో ఎఫ్ఐఆర్ (150/24) నమోదు చేశారు.



జశ్వంత్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు (ఇన్‌సెట్‌లో) మద్దు జశ్వంత్

జిల్లా వార్తలు

సైకిళ్లపై శ్రీశైలం యాత్ర



శ్రీశైలం వెళ్తున్న మాలధారులు

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెంనకు చెందిన అయ్యప్ప గురుస్వాములు పిపల్ల శ్రీనివాస్, అంగడాల వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి సైకిళ్లపై శనివారం బయలుదేరారు. శ్రీనివాస్ ఏటా అయ్యప్ప మాల ధారణ అనంతరం ఓ పుణ్యక్షేత్రానికి సైకిల్‌పై వెళ్తుంటారు. గత ఏడాది భద్రాచలం వెళ్లగా ఈ సారి వెంకటేశ్వర్లుతో కలిసి శ్రీశైలం బయలుదేరారు. సుమారుగా 350 కి.మీ. మేర తమ యాత్ర కొనసాగుతుందని తెలిపారు.

రామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు దంపతులు భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

పాలేరు దారిలో జర పైలం..

మండలంలోని పాలేరు రిజర్వాయర్ అలుగుల సమీపాన నిర్మించిన కాజ్‌వే ఇటీవల భారీ వరదలతో ధ్వంసమైంది. కాజ్‌వేపై రహదారి దెబ్బతినడమే కాక ఇరువైపులా ఉన్న రక్షణ రాళ్లు వరదనీటిలో కొట్టుకపోయాయి. దీంతో ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించే వాహనదారులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు.

– కూసుమంచి



రక్షణ గోడ లేక ప్రమాదకరంగా మారిన కల్వర్టు

- ప్రమాదకరంగా మారిన పాలేరు కాజ్‌వే
- ఇటీవల వరదలతో ధ్వంసమైన కాజ్‌వే, రహదారి
- ఆదమరిస్తే అంతే సంగతులు



వరదలతో దెబ్బతిన్న రహదారి

పైపై మరమ్మతులు

రిజర్వాయర్ అలుగుల ప్రాంతంలో అర కిలోమీటరు మేర రహదారి తీవ్రంగా దెబ్బతింది. వరద ఉధృతి తగ్గాక అధికారులు పాత బీటీని తొలగించారే తప్ప రహదారికి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఈ దారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ఈ దారి మీదుగా రాకపోకలు సాగిస్తాయి. కాజ్‌వేకు ఇరువైపులా రక్షణ గోడలు, రాళ్లు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. అంతేకాక కాజ్‌వేకు రెండుపక్కలా పెద్దపెద్ద బండరాళ్లు ఉండటంతో వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాల బారిన పడే అవకాశముంది. రాత్రివేళ మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఇక మిగిలిన రహదారి గుంతలమయంగా మారడం, మధ్యలో డివైడర్ కొట్టుకుపోయి నామరూపాలు కోల్పోయాయి. ఇదంతా జరిగి నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టడం.. పూర్తిస్థాయి మరమ్మతులకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని చెబుతుండటంపై వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రాజుపేట వద్ద..

మండలంలో రాజుపేట గ్రామం వద్ద పాలేరు ఏటిపై నిర్మించిన కాజ్‌వే కూడా ప్రమాదకరంగా మారింది. ఇటీవల వరదతో కాజ్‌వే పూర్తిగా మునిగిపోయింది. ఈ ప్రాంతంలో కాజ్‌వే తక్కువ ఎత్తు కారణంగా ఏరు పొంగినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ రహదారి మీదుగా సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతంతో పాటు ఇతర గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తారు. ఈ ప్రాంతంలోనూ ఏ మాత్రం అదుపు తప్పినా ఏటిలోకి దూసుకువెళ్లే ప్రమాదం పొంచి ఉన్నందున హై లెవల్ కాజ్‌వేలు నిర్మించి తమ కష్టాలు తీర్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

హైలెవల్ కాజ్‌వే నిర్మించాలి..

మా గ్రామం వద్ద పాలేరు ఏటిపై కాజ్‌వే ఎత్తు తక్కువగా ఉంది. దీంతో ఏరు పొంగినప్పుడల్లా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ హైలెవల్ కాజ్‌వే నిర్మిస్తేనే మా ఇబ్బందులు తొలగుతాయి.

–యాసా సత్యనారాయణరెడ్డి, రాజుపేట

మరమ్మతులకు ప్రతిపాదనలు

వరదతో ధ్వంసమైన కాజ్‌వే వద్ద తాత్కాలిక మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయి పనులకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. ఎన్‌హెచ్ఏఐ పరిధిలో ఈ రహదారి ఉంది. అయినప్పటికీ వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

–దేవేందర్, ఏఈ, ఆర్అండ్‌బీ

వరిలో సుడిదోమ ఉధృతి



సుడిదోమ ఉధృతితో ఎర్రబారిన వరి (ఇన్‌సెట్) మాడిపోతున్న పంటను చూపుతున్న రైతు

- అన్నదాతలకు శాపంగా మారిన తెగులు
- చేతికందే దశలో నష్టపోతున్నామని రైతుల ఆవేదన
- సస్యరక్షణ చర్యలపై అధికారుల సూచనలు

చంద్రుగొండ: వరిపంటలో ప్రస్తుతం సుడిదోమ ఉధృతి కనిపిస్తోంది. ఫలితంగా చేతికందే దశకు చేరిన వరిపంట దెబ్బతింటోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దుబ్బులను ఆశించే ఈ సుడిదోమ రసం పీల్చేస్తుండగా సుడులు సుడులుగా ఎండిపోతోంది. సుడిదోమను ముందుస్తుగా గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంట మొత్తంగా నష్టపోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరి పంట ప్రస్తుతం కంకులు అర్రువంచే దశలో ఉంది.

సస్యరక్షణ చర్యలు ఇలా..

వరిపంటలో సుడిదోమ ఉధృతి కనిపిస్తే చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను చంద్రుగొండ మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్ వెల్లడించారు. పొలంలో వరినారు నాటిన వారం రోజుల్లో కాలిబాటలు వేయాలి. 3 మీటర్ల వెడల్పులో 30 సెంటీమీటర్ల కాలిబాట వేసుకోవాలి. ప్రస్తుతం సుడిదోమ ఉధృతిని అరికట్టేందుకు బ్రొఫెజియోన్‌ను లీటర్ నీటికి 1.2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలని సూచించారు. లేదా పైమెట్రోజిన్ మందు అయినా వాడాలని తెలిపారు.

పంట ఎర్రబారుతోంది..



సుడిదోమ ఆశించడంతో పంట మొత్తం ఎర్రబారుతోంది. చేతికందే దశలో కళ్ల ముందు పంట నాశనమవుతుంటే ఆందోళనగా ఉంది. ఇదిలాగే ఉంటే పెట్టిన పెట్టుబడి కూడా రావడం కష్టమే. చాలాచోట్ల ఇలాగే ఉందని చెబుతున్నారు.

–దెబ్బెందుల చిట్టయ్య, రైతు, చంద్రుగొండ

మందులు పిచికారీ చేస్తున్నాం



ఏపుగా పెరిగిన పంటను సుడిదోమ ఆశించడంతో ఒక్కసారిగా ఎర్రపడింది. దీంతో అధికారులు చెప్పినట్లుగా మందుల పిచికారీ చేస్తున్నాం. దోమ తగ్గకపోతే మాత్రం కోత దశకు వస్తున్న పంట చేతికందే పరిస్థితి లేక తీవ్రంగా నష్టపోతాం.

–జ్యోతి దర్గయ్య, రైతు, తిప్పనపల్లి

న్యాయం చేయాలని మంత్రికి వినతి




ఇంటిస్థలం పత్రాలు అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: డీఎస్సీ–2024లో అర్హత సాధించి హిందీ పండిట్లుగా ఉద్యోగం పొంది కొన్నిరోజులు విధులు నిర్వర్తించిన ఖమ్మం జిల్లాకు చెందిన ఏడుగురికి తగిన విద్యార్హతలు లేవని తొలగించారు. ఈ మేరకు ఆయా అభ్యర్థులు శనివారం కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగాలు చేస్తుండగా ఎటువంటి సమాచారం లేకుండానే ఆకస్మికంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన తమకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. దీంతో మంత్రి స్పందిస్తూ డీఈఓ ద్వారా వివరాలు తెలుసుకుని, నిబంధనల మేరకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఇంటిస్థలం పత్రాల పంపిణీ..

కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో నివాసముండే షేక్ యాకూబ్ – సైదాబీ దంపతులు సెప్టెంబర్ మొదటి వారంలో వరదలతో కొట్టుకుపోయి మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఇంటి స్థలం పత్రాలను వారి కుమారులు యూసుఫ్, షరీఫ్‌కు మంత్రి పొంగులేటి అందజేశారు.

నీలాద్రీశ్వరాలయంలో పూజలు



పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి, తదితరులు

పెనుబల్లి: మండలంలోని నీలాద్రీశ్వరాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం పూజలు నిర్వహించారు. అర్చకులు, ఈఓ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేయించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అటు ఆయిల్‌పామ్.. ఇటు వరి!



అంతరపంటగా సాగు చేస్తున్న రైతు

ఆయిల్‌పామ్ క్షేత్రంలో సాగవుతున్న వరి

ఆయిల్‌పామ్ మొక్కలు నాటాక మూడు నుంచి నాలుగేళ్ల అనంతరం దిగుబడి మొదలవుతుంది. అయితే, భూమి మొత్తం ఖాళీగానే ఉండటంతో అప్పటివరకు రైతులు నష్టపోకుండా అంతరపంటలు సాగు చేసుకునే వీలుంటుంది. అయితే, ఎక్కువ మంది మిర్చి లేదా పప్పుగింజల పంటలు సాగు చేస్తారు. కానీ కరకగూడెం మండలంలోని మోతెకు చెందిన ఓ రైతు వినూత్నంగా ఆయిల్‌పామ్‌లో వరి సాగుచేశాడు. నీటి వసతి ఉండటంతో వరి సాగు చేస్తున్న ఆ రైతు ఆయిల్‌పామ్ దిగుబడి వచ్చే వరకు నష్టపోకుండా ఈ విధానాన్ని ఎంచుకున్నట్లు చెబుతున్నారు.

– కరకగూడెం